తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ముత్యపుపందిరిపై శ్రీరామచంద్రుడు

### -ఉదయం సింహవాహనంపై దర్శనం



తిరుపతి, మార్చి 22ప్రభాతవార్త:

తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి స్వామివారు ముత్యపుపందిరిపై భక్తులకు దర్శనమివ్వగా, ఉదయం సింహవాహనంపై కటాక్షించారు. ఎంతో వేడుకగా జరుగుతున్న కోదండరాముని వాహనసేవలు బుధవారం ఉగాది సందర్భంగా భక్తులు భారీగా చేరుకుని రామ నామంతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## చందనాలంకారంలో శ్రీచెంగాళమ్మ



సూళ్లూరుపేట, మార్చి 22 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని చందనాలంకారం చేశారు. బుధవారం ఉదయం చందనాలంకార స్వర్ణకిరీత స్వర్ణాభరణ శోభితురాలైన శ్రీచెంగాళమాతను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా దంపతులచే కుంకుమార్చన నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అమ్మణ్ణిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కర్లపూడి సురేష్ బాబు, బండి సునీత, ఓలేటి బాలసత్య నారాయణ, వంకా దినేష్, ఎంఎం పద్మజ పాల్గొన్నారు. లక్ష కుంకుమార్చన పూజకు చిట్టేటి పెరు మాళ్ల గోవిందమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## కలియుగవైకుంఠంలో ఉగాది ఆస్థానం









తిరుమల, మార్చి 22ప్రభాతవార్తప్రతినిధి:

తెలుగునూతన సంవత్సరం "శోభకృత్" నామ ఉగాది పర్వదినం ఆస్థానం బుధవారం ఉదయం వెంకన్నఆలయంలో వేడుకగా జరిగింది. ఆస్థానంలో భాగంగా మూలవిరాట్టు వెంకన్నకు, ఉత్సవ మూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేశారు.

**-ఆకట్టుకున్న ఫలపుష్ప ఆకృతులు:**

ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయం వెలుపల ముందుభాగంలో, వాహనమండపానికి చేరువలో టిటిడి ఉద్యానవన విభాగం ఏర్పాటుచేసిన ఫల,పుష్ప ఆకృతులు భక్తులను ఆకట్టుకున్నాయి. దశావతారాలు, కొబ్బరిపూలతో అలంకరణలు, పద్మావతి శ్రీనివాసుల కల్యాణఘట్టం, లక్ష్మీదేవితో శ్రీనివాసులు, పౌరాణిక ఘట్టాలు అద్భుతంగా తీర్చిదిద్దారు.

## వడ్డీకాసులవాడి భారీ బడ్జెట్ !

### -రూ.4,411కోట్లతో అంచనాలు



తిరుమల, మార్చి 22ప్రభాతవార్తప్రతినిధి:

ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బడ్జెట్‌ను భారీ అంచనాలతో టిటిడి అధికారులు రూపొందించారు. ఈ బడ్జెట్‌ను పాలకమండలి గతనెల 15న ఆమోదించినా బుధవారం ఉదయం తిరుమలలో టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇఒ ఏవి ధర్మారెడ్డి, జెఇఒ సదాభార్గవితో కలసి వివరాలు వెల్లడించారు. భక్తులు హుండీకి సమర్పించే కానుకల ద్వారా దాదాపు 1,591కోట్ల రూపాయలు ఆదాయం లభిస్తుందని అంచనా వేశారు. తిరుపతిలోని ఎస్‌జివిఎస్ ఆర్ట్సు కళాశాల ఎడమవైపు మూడో అంతస్తు నిర్మాణం, ల్యాబ్ ఆధునీకరణ, గ్రంధాలయం, ఇండోర్ గేమ్స్ భవనాల నిర్మాణానికి 4.71కోట్లు ఖరారు చేశామన్నారు.



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో బుధవారం పంచాంగ శ్రవణం చేస్తున్న పండితులు మోహన రామలింగం శర్మ, వేదపండితులు

## పండగపూట విషాదం

### విద్యుత్ షాక్ గురై బాలుడు మృతి





విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విక్రం, వేపచెట్టులో ఉన్న 11కేవి విద్యుత్ తీగలు

పెద్దపంజాణి మార్చి 22 ప్రభాతవార్త :

గ్రామమంతా పండగసందడిలో ఉండగా వేపాకు, వేపపూత తీసుకువచ్చేందుకు పొలాలవైపు వెళ్ళిన ఓ బాలుడు అకస్మాత్తుగా విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. వివరాలిలా..పెద్దపంజాణి మండలం బసవరాజుకండ్రిగలో విద్యుత్ షాక్ తగిలి విక్రం(16) అనే బాలుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా..గంగవరం మండలం గండ్రాజుపల్లి పంచాయతీ పరిధిలోని జంగాలపల్లి చెందిన షణ్ముగంకు ఇరవై ఏళ్ల క్రితం బసవరాజుకండ్రిగకు చెందిన అరుణ(బుజ్జమ్మ)తో వివాహం జరిగింది. అరుణ దంపతులకు కుమార్తె, కుమారుడు. కుమార్తెకు వివాహం జరిపించి ఏడాదిక్రితం తన కుమారుడు విక్రంతో బసవరాజుకండ్రిగలోని పుట్టింటికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ ఇక్కడే నివసించేవారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉగాది పండగ కావడంతో వేపాకు, వేపపూత కోసుకురమ్మని కుటుంబ సభ్యులు విక్రంకు చెప్పడంతో అతను వేపాకు, వేపపూత కోసం సమీపంలోని వ్యవసాయ పొలంలోకి వెళ్ళాడు. ఎంతసేపటికి రాక పోవడంతో అరుణ కొడుకు కోసం వెతక సాగింది. సమీపంలోని పంజాణి సత్రం వేణుగోపాల్ నాయుడుకు చెందిన వ్యవసాయ పొలంలో ఉన్న వేపచెట్టుకింద విక్రం వేపచెట్టులో ఉన్న 11కెవి విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై కిందపడి మృతి చెందినట్లు గుర్తించి బిగ్గరగా కేకలు వేసింది. విషయం గుర్తించిన స్థానికులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించి మృతుని తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పండగపూట తన కుమారుడు మృతి చెందటంతో అరుణ చేసిన ఆక్రందనలు గ్రామస్థులను కంటతడి పెట్టించాయి. రోజూ తమతో పాటు సరదాగా ఆడుకుంటూ ఉండే విక్రం పండగపూట మృతి చెందటంతో అతని బంధువులు, స్నేహితులు కన్నీటి పర్యాంతమైయ్యారు.

## రాలుతున్న మామిడి పిందె

### ఆందోళనలో రైతులు

విజయపురం, మార్చి 22 ప్రభాతవార్త :

మామిడిలో ఈ ఏడు పూత బాగా వచ్చినప్పటికీ పిందె రాలిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఆశించిన స్థాయిలో పూత వచ్చినా పిందెలు నిలబడడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పొగ మంచు లేదా మందులు పిచికారి చేయడం వల్ల ఈ విధంగా జరుగుతోందేమోనని రైతులు భావిస్తున్నారు. దీనిపై సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఉద్యానవన శాఖాధికారులు సహకరించడం లేదని వాపోతున్నారు. ప్రతి ఏడాది మందులు పిచికారి చేయడానికి ఒక ఎకరాలు రూ. 15,000 వేలు ఖర్చవుతుందని, మామిడిలో వచ్చే ఆదాయం ఖర్చులకు కూడా సరిపోవడం లేదంటున్నారు. వరుసగా నాలుగు సంవత్సరాలుగా మామిడి రైతులు నష్టాలు వస్తున్నాయని తెలిపారు. విజయపురం మండలంలో సుమారు 770 హెక్టార్లలో మామిడి పండిస్తున్నారు. మండలంలో బంగినపల్లి, తోతాపురి, నీలం, రుమాణి, కలేపాడు, సింధూర వంటి రకాలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇక్కడ సాగవుతున్న మామిడిని ఎక్కువగా తమిళనాడులోని కోయంబేడు, కర్ణాటకలో



బెంగళూరు, మహారాష్ట్ర, తెలంగాణ, పుత్తూరు, తిరుపతి మార్కెట్లకు తరలించి విక్రయిస్తారు. విజయపురం, జగన్నాథపురం, కోసలనగరం, పాతార్కాడు, మహారాజపురం, శ్రీహరిపురం, మల్లారెడ్డికండ్రిగ, నారపరాజుకండ్రిగ పంచాయతీల్లో మామిడిని ఎక్కువగా సాగుచేస్తున్నారు.

### మందులు పనిచేయడం లేదు

**చిన్నబ్బరాజు, శ్రీహరిపురం**



మామిడికి ప్రతి సంవత్సరం పూత కోసం మూడు నుంచి నాలుగు పర్యాయాలు మందులు పిచికారి చేసినా ఆశించిన ఫలితం రావడం లేదు. గతంలో వున్న మందులను ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రస్తుత్వం వున్న మందులు పనిచేయడం లేదు. సంబంధిత అధికారులు మామిడి రైతులకు సూచనలిచ్చి ఆదుకోవాలి.

### ప్రభుత్వం ఆదుకోవాలి

**బాలసుబ్రమణ్యంరాజు, శ్రీహరిపురం**



ప్రతి ఏడాది నష్టపోతున్న మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. మామిడిని నమ్ముకున్న రైతులు ప్రతిసారి నష్టం వస్తుండడంతో అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. మామిడి రైతులకు కూడా ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేయాలి.



తెలుగు నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని బుధవారం చిత్తూరు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పూజల్లో కలెక్టర్ హరిచందన్

## తిరుపతి జిల్లా అభివృద్ధిలో పరుగులు పెడుతుంది

### -దైవానుగ్రహంతో జిల్లా పాలకుల పేర్లు కూడా స్వామి పేర్లే

### కలెక్టరేట్‌లో పంచాంగ శ్రవణం నిర్వహించిన బ్రహ్మర్షి శివరామ శర్మ

తిరుపతిరూరల్, మార్చి22 ప్రభాతవార్త:

శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో తిరుపతి జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి వైపు పోటీపడి ముందుకు సాగాలని, జిల్లాకు అన్నికు అన్ని శుభాలే జరగాలని ఆకాంక్షిస్తూ కలెక్టరేట్‌లో ఉగాది పంచాంగ శ్రవణం జరుపుకున్నామని కలెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. బుధవారం ఉగాది పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్ పంచాంగ శ్రవణం నిర్వహించారు. బ్రహ్మర్షి శివరామ శర్మ పంచాంగం శ్రవణం వినిపిస్తూ పంచాంగం ఉగాదిరోజున విన్నా, చదివినా మంచి జరుగుతుందన్నారు. తిరుపతి జిల్లా తుల రాశి వల్ల అభివృద్ధిలో



వేగంగా పరుగులు తీస్తుందని, జిల్లా ప్రథమ పరిపాలనాధికారి కలెక్టర్ వెంకట రమణారెడ్డి, ద్వితీయ పాలనాధికారి బాలాజీ, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావులు కొత్త జిల్లాలో తిరుమల శ్రీవారి పేరుతో పేర్లు ఉండటం స్వామి అనుగ్రహం అన్నారు. శోభకృత్ నామ సంవత్సరంలో శోభం అంటే ప్రకాశించేవాడని, అన్ని శుభాలే జరుగుతాయన్నారు. 60 సంవత్సరాల తెలుగు సంవత్సరాదిలో శోభకృత్ నామ సంవత్సరం 37వ దని, కలియుగం 5125వ సంవత్సరంలో ఈ ఉగాది అడుగు పెట్టిందని, బుధుడు రాజుగా వ్యవమరిస్తున్నందున విద్యావంతులకు, వ్యాపారస్తులు ఉన్నతస్థితికి ఎదుగుతారని తెలిపారు. రాజకీయ ఒడిదుడుకులు ఉంటాయని, అధికారులు మన్ననలు పొందుతారని, లోహం ధరలు బంగారు, వెండి వంటివి ధరలు పెరుగుతాయని, శుదాయక జీవన విధానం ఉంటుందని, ఎండలు అధికంగా ఉంటాయని, ఈ ఏడాది ఏప్రిల్ 22 నుండి మే 3 వరకు గంగా పుష్కరాలు సమయంలో స్నానాలు ఆచరిస్తే మంచిదన్నారు. మే మాసంలో ఎండలలో శ్రామిక పనులు ప్రారంభించడం మంచిది కాదని, దుర్గాదేవి, విష్ణుమూర్తి ఆరాధనలు, రాహు కేతు పూజలు చేస్తే మంచిదని, 12 రాశుల ప్రభావం, జాగ్రత్తలు వివరించారు.

## అమ్మవారి ఆలయంలో ఘనంగా ఉగాది వేడుకలు



తిరుచానూరు, మార్చి 22 ప్రభాతవార్త:

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మద్యాహ్నం స్నపన తిరుమంజనం, సాయంత్రం అమ్మవారు పుష్ప పల్లకిలో నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. అనంతరం రాత్రి అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, ఆలయ ఇన్స్‌పెక్టర్లు ప్రసాద్, అశోక్, సుభాస్కర్, ఏవిఎస్ఓ శైలేంద్రబాబు, విఐ రామ్మోహన్, ఆగమ సలమాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### ఉష్ణోగ్రతలు

22/3/2023



- తిరుపతి 34 డిగ్రీలు
- చిత్తూరు 35 డిగ్రీలు
- కుప్పం 26 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 35 డిగ్రీలు
- వెంకటగిరి 35 డిగ్రీలు
- గూడూరు 35 డిగ్రీలు

### బంగారం ధరలు

22/3/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,470

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,967

### కోడిగ్రుడ్ల ధరలు

22/3/2023



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

## కూరగాయలు, పూలతో శాఖంబరిదేవిగా గంగమ్మ దర్శనం



తిరుపతి, మార్చి 22ప్రభాతవార్త:

ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం ఉదయం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను ఆలయ అధికారులు, అర్చకులు కూరగాయలు, పుష్పాలతో శాఖంబరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అమ్మవారి గర్భగుడి నిర్మాణం పనులను, విమానగోపురం నిర్మాణంపనుల ఇటుకలను ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, నగరపాలక మేయర్ డాక్టర్ శిరీష, ఉపమేయర్ ముద్రనారాయణ, ఆలయ ఛైర్మన్ గోపీయాదవ్, ఆలయ ఇఒ ఎం.మునికృష్ణయ్య పరిశీలించారు. అమ్మవారిని దర్శించుకుని ఉగాది పచ్చడిని అందుకున్నారు.

## భక్త కన్నప్పకు శివయ్య సారె



భక్తకన్నప్పకు సారె తీసుకొస్తున్న ఎంఎల్ఏ బియ్యపుమధుసూధనరెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో బుధవారం శోభాకృతనామ సంవత్సరాది సందర్భంగా యుగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం పట్టణంలోని తేరువీధిలో వెలసిన బిక్షాల గాలిగోపురం ఎదురుగా ఉన్న భక్త కన్నప్పకు సారెను అందించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి దంపతులు, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ వికె సాగర్‌బాబులు ఆలయంలోని అలంకార మండపం నుంచి సారెను అంగరంగ వైభవంగా మేళ తాళాలు మంగళవాయిద్యాలతో తీసుకొచ్చారు. సారెతో భక్తకన్నప్ప విగ్రహాన్ని అలంకరించి అభిషేకించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ భక్తజనవల్లభుడైన పరమేశ్వరుని అనుగ్రహంతో ముక్తి పొందిన భక్తుడు కన్నప్ప భక్తులకు ఆదర్శప్రాయుడన్నారు. ఆయనకు పట్టువస్త్రాలను అందించటం తన పూర్వజన్మసుకృతం అన్నారు. ఈ కార్యక్రమాల్లో వారితో పాటు సభ్యులు కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మీ, చెంచులత, దాసరి జయమ్మ, ప్రత్యేక ఆహ్వానితులు నీల, శ్రీదేవి, శోభ దేవస్థానం ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, ఎఇఓ సతీష్‌మాలిక్, టెంపుల్ సూపరింటెండెంట్ నాగభూషణం, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం పట్టణప్రముఖులు నందా మెడికల్స్ అధినేత, సామాజిక సేవకులు కొండూరు నంద, భాస్కర్ ముదిరాజ్, గోపిగౌడ్, లక్ష్మీపతి, పాలమంగళం రవి, తదితరులు పాల్గొన్నారు.

## రేపు పిఇఎస్ వైద్య కళాశాల స్నాతకోత్సవం

**పిఇఎస్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొ.ఎంఆర్.దొరస్వామి నాయుడు**

**కుప్పం, మార్చి 22 ప్రభాతవార్త**



కుప్పం పిఇఎస్ వైద్య కళాశాల 15వ స్నాతకోత్సవంను ఈనెల 24న పిఇఎస్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు పిఇఎస్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన కార్డియోథొరాసిక్ సర్జన్ డా॥ వివేక్ జావలి హాజరవుతున్నారు. స్నాతకోత్సవం సందర్భంగా 150మంది ఎంబిబిఎస్ విద్యార్థులు, 64మంది పి.జి. విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. అలాగే అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలతో పాటు మెరిట్ సర్టిఫికెట్లు అందించడం జరుగుతుందన్నారు.

## మంత్రి చొరవతో ఆరడిగుంటలో స్టీల్‌పైపుల ఫ్యాక్టరీ

**24న మంత్రి, ఎంపిలచే భూమిపూజ**

**పుంగనూరు, మార్చి 22 ప్రభాతవార్త**



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపి మిధున్‌రెడ్డిల చొరవతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో పుంగనూరులో ఈనెల 24న స్టీల్‌పైపులకు సంబంధించి ఫెర్రోఅలయ్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజలు నిర్వహిస్తున్నట్లు పిఎంకే ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ తెలిపారు.పా ఫ్యాక్టరీ సిఓఓ సురేష్‌కందేలా ఫ్వ్ల్,సిఎం దొరైరాజ్,రాష్ట్రజానపదకళల అకాడమీ ఛైర్మన్ కొండవీటి,మున్సిపల్‌ఛైర్మన్ అలీంబాషా,ఎంపిపి అక్కిసాని భాస్కరరెడ్డిల సమక్షంలో ప్రకటన విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రూ.160కోట్లతో 52ఎకరాలలో నిర్మించబడుతున్న ఈ ఫ్యాక్టరీ వల్ల నిరుద్యోగులకు బాసటగా నిలుస్తామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపిలు మిధున్‌రెడ్డి,రెడ్డెప్పలు భూమిపూజా కార్యక్రమాలలో పాల్గొంటారన్నారు.

## మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఉగ్గుమూడి సంధ్య

**బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 22 ప్రభాతవార్త:**



బుచ్చినాయుడు కండ్రిగ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే ఆదిమూలం, మూడు మండలాల మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు సహకారంతో ఉగ్గుమూడి సంధ్యను నియమించినట్లు వ్యవసాయ మార్కెటింగ్ కార్యదర్శి, వైసీపీ జిల్లా నాయకులు ఉగ్గుమూడి గురునాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పరిపాలన కాలం నుంచి జగన్మోహన్‌రెడ్డి వైసీపీ పార్టీ వరకు నేను చేసిన సేవలను గుర్తించి నేడు మార్కెట్ కమిటీలో కమిటీ డైరెక్టర్‌గా ఉన్న తన కోడలు ఉగ్గుమూడి సంధ్యను నియమించడం ఎమ్మెల్యే ఆదిమూలం, మూడు మండలాల మండల పార్టీ అధ్యక్షులకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి నాయకత్వ లక్షణాల అడుగు జాడల్లో నడుస్తూ పార్టీ కోసం ప్రతినిత్యం కష్ట నష్టాలను భరిస్తూ పని చేస్తున్నందుకు మాకు ఈ అవకాశం ఇచ్చినందుకు రుణపడి ఉంటామని తెలియజేశారు. ఏఎంసీ అధ్యక్షులుగా ఎన్నుకోబడిన ఉగ్గుమూడి సంధ్య మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం మూడు మండలాల వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సిబ్బంది అందరి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని, నన్ను చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు విశ్వాసంతో రుణపడి పని చేస్తానని హామీ ఇచ్చారు.

## పాలసముద్రం మండలంలో కొత్తగా ఐదు 4జి టవర్స్

**పాలసముద్రం, మార్చి 22 ప్రభాతవార్త:**

పాలసముద్రం మండలంలో బిఎస్ఎల్ఎన్ సేవలను మరింత విస్తృతం చేయడానికి కొత్తగా బిఎస్ఎన్ఎల్ 4జి టవర్స్ ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు సింహరాజపురం, అలుపులగుంట, బలిజకండ్రిగ, పాలసముద్రం, వనదుర్గాపురం గ్రామాలకు కొత్తగా 4జి బిఎస్ఎన్ఎల్ టవర్స్ మంజూరు అయ్యాయని టెలికాం సంస్థ ట్రాయ్ సిఐజి సభ్యుడు చిట్టిబాబు తెలిపారు. ఇది వరకు పాలసముద్రం మండల పరిధిలో బిఎస్ఎన్ఎల్ 2జి సేవలు మాత్రమే వినియోగదారులకు అందుబాటులో వున్నాయని ఇకపై వినియోగదారులకు 4జి సేవలు అందుబాటులోకి రానున్నాయని ఆయన వివరించారు. స్వదేశీ 4జి సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి సి-డాట్(సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాట్రిక్స్), టిసిఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్)తో కలసి పనిచేస్తోందన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలుపాలసముద్రం మండల పరిధిలో తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం కన్వీనర్ చిట్టిబాబును ఆయన నివాసంలో మండల దేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

## దేవాలయ స్థలం కబ్జా

**చిత్తూరు, మార్చి 22 ప్రభాతవార్త:**



చిత్తూరు రామ్‌నగర్ కాలనీలో మునీశ్వరస్వామి దేవాలయ స్థలం కబ్జాకు గురైందని ఈ విషయంపై రెవెన్యూ అదికారులు విచారించి న్యాయం చేయాలని రామ్‌నగర్ కాలనీకి చెందిన మహిళలు ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం రామ్‌నగర్ కాలనీకి చెందిన కొంతమంది మహిళలు మాట్లాడుతూ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఓ మహిళా ఉద్యోగి రామ్‌నగర్ కాలనీలోని మునీశ్వరస్వామి ఆలయ స్థలంను కబ్జా చేసుకొని కార్యాలయంలో తనకు వున్న పలుకుబడిని ఉపయోగించుకొని స్థల రికార్డులను సైతం తమ పేరుతో మార్చుకొందన్నారు. అయితే ఈ స్థలం అనాదిగా మునీశ్వరస్వామి దేవాలయ స్థలంగా ప్రఖ్యాతి గాంచిందన్నారు. అ మేరకు రెవెన్యూ అధికారులు విచారించి దేవస్థానంకు న్యాయం చేయాలని మహిళలు కోరారు.

## ఘనంగా ఉగాది పర్వదినం

**కుప్పం, మార్చి 22 ప్రభాతవార్త**



కుప్పం నియోజకవర్గంలో తెలుగువారి తొలి పండగ ఉగాది పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తమ ఇళ్లల్లో చనిపోయిన పెద్దలకు దుస్తులు పెట్టి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడిని బంధుమిత్రులకు పంచి పెట్టారు. గ్రామాల్లో సైతం ఉగాది సందడి నెలకొంది. పండగ కోసం బయటి ప్రాంతాలకు వెళ్లిన వారు సైతం స్వగ్రామాలకు చేరుకున్నారు. ఆదివారం సైతం కుప్పం నియోజకవర్గంలో పండగను జరుపుకుంటారు. కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో వేద పండితులు సోమశేఖర శాస్త్రి పంచాంగ శ్రవణం చదివి విన్పించారు. కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు, అఖిల పక్ష నేతలు పాల్గొన్నారు. కాగా పండగ సందర్భంగా కుప్పం పట్టణం జనంతో కిటకిటలాడింది. ఉదయం పెద్ద ఎత్తున గ్రామీణ ప్రాంతాల నుంచి జనం పండగసరుకులకొనుగోళ్ల నిమిత్తం పట్టణానికి రావడంతో ప్రధాన రహదారి కిటకిటలాడుతూ కన్పించింది.

## ఆలయ పునర్నిర్మాణంపై అధికార.. ప్రతిపక్ష నేతల సమావేశం

**కుప్పంరూరల్, మార్చి 22 ప్రభాతవార్త**



జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ ఆలయ పునర్నిర్మాణంపై బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు, పూజారులు, భక్తుల మధ్య సమావేశం జరిగింది. గత రెండు రోజుల క్రితం తెదేపా నేతలు ఆలయం వద్దకు చేరుకుని ప్రజలకు సరైన సమాచారం లేకుండాపోవడంతో పాటు ఆలయంను ఇష్టారాజ్యంగా నిర్మిస్తున్నారని పేర్కొన్న విషయం విదితమే. దీంతో బుధవారం ఆలయ ఛైర్మన్ కెఎ మంజునాథ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మున్సి పల్ వైస్ ఛైర్మన్ మునస్వామి తదితరులు ఆలయ నిర్మాణంపై చర్చించారు. కాగా ఆలయ ఒకు నిర్మిస్తున్న గడప తక్కువ ఎత్తులో నిర్మిస్తున్నారని అమ్మవారి విగ్రహం ఆలయం బయట వచ్చేందుకు ఇబ్బంది కలుగుతుందని దేశం నేతలు గోపీనాథ్, ఆర్ఆర్ రవి, బుజ్జి తదితరులు పేర్కొనగా గడప ఎత్తు మరలా పెంచుతామని నేతలు పేర్కొన్నారు. కాగా గురువారం స్థపతి, కాంట్రాక్టర్లు వచ్చి నిర్మాణ పనులు పరిశీలిస్తారని భక్తులకు అనుగుణంగా ఆలయాన్ని నిర్మించడం జరుగుతుందని అధికార పార్టీ నేతలు పేర్కొన్నారు.

## తెదేపా కార్యాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు

**కుప్పంరూరల్, మార్చి 22 ప్రభాతవార్త**



ఉగాది వేడుకలను స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు పంచాంగ శ్రవణం విన్పించారు. ఈసందర్భంగా కార్యాలయంలో తెదేపా ఇన్‌ఛార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, మేనేజర్ కాళప్ప నాయుడు తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నేతలు ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్,సాంబశివం, డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, శాంతారాం, త్రిలోక్, బాబునాయుడు, కౌన్సిలర్లు సోమశేఖర్, దాము, వేలు, జాకీర్, సెల్వరాజ్, సురేష్, మణి, రామచంద్ర, జయరాంనాయుడు, మహేంద్ర,తిరుమగళ్, రవి, నరేష్, అన్నాదొరై తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కార్యాలయంలో అన్నదానం నిర్వహించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అర్ధగిరిలో ఘనంగా శ్రీశోభకృత్ నామ ఉగాది వేడుకలు

**తవణంపల్లె, మార్చి 22 ప్రభాతవార్త:**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శ్రీశోభకృత్ నామ ఉగాది వేడుకలను బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు బుధవారం ఆలయంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహించి శోభాయమానంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు పంచాంగశ్రవణం గావించి ఉగాది పచ్చడిని భక్తులకు పంచిపెట్టారు. ఉగాది పండుగ సందర్భంగా స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ సురేంద్రారెడ్డి, ఈఓ సుబ్బారెడ్డి, పాలకమండలి సభ్యులు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా ఉగాది వేడుకలు

**తవణంపల్లె, మార్చి 22 ప్రభాతవార్త:**

శ్రీశోభకృత్ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం మండల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. తెలుగువారికి నూతన సంవత్సరమైన ఉగాది పండుగను ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండి ప్రజలు ఒకరినొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ పిండి వంటలు, మాంసాహార భోజనాలు ఆరగించి ఉగాదిని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అన్ని ఆలయాల్లో ఉగాదిని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా ఈ ఆలయాలలో పంచాంగ శ్రవణం గావించి ఉగాది పచ్చడిని పంచిపెట్టారు. దీనితో ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి.

**అరగొండ కోదండరామాలయంలో...**

మండలంలోని అరగొండ శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో శ్రీశోభకృత్ సంవత్సర ఉగాది వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం పండితులు పంచాంగశ్రవణం గావించి భక్తులకు తీర్థ,ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో అరగొండ పరిసర గ్రామాల ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉగాది వేడుకలు

**వెదురుకుప్పం, మార్చి 22 ప్రభాతవార్త :**

తెలుగు కొత్త సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని ఘనంగా ఆలయాలల్లో ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు. మండలంలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయం, లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయం, అరుణగిరి కొండ పై వేలసిన కొండమల్లెశ్వరస్వామి ఆలయం, సాయిబాబా ఆలయంలలో చలువ పందిరిలు వేసి నిర్వహకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. శోభకృత నామ సంవత్సరం వేడుకల్లో భాగంగా ఆలయాలల్లో ప్రత్యేక పూజ నిర్వహించి దైవ దర్శనం భాగ్యం కల్పించారు. నూతన సంవత్సరం ప్రజలకు శుభాలు జరగాలని పంచంగ శ్రవణం చేశారు. అనంతరం దైవ దర్శనం చేసుకున్న భక్తులకు ఉగాది పచ్చడితో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. చవటగుంట మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో మాజీ ఎంపిపి జ్ఞాన కొండా రెడ్డి ఉభయదాతలుగా వ్యవహారించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకులు మృతి

**గుడుపల్లె, మార్చి 22 ప్రభాతవార్త** మండలంలోని కనమనపల్లి వద్ద మంగళవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈసంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. మిద్దూరుకు చెందిన రెడ్డెప్ప, కుప్పిగానిపల్లి సిద్దిక్, గుండ్లసాగరంకు చెందిన శ్రీనివాసులు వేర్వేరు ద్విచక్రవాహనాల్లో వస్తున్నారు. ముందుగా వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేసే సమయంలో వీరి ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడ్డ రెడ్డెప్ప, సిద్ధిక్, శ్రీనివాసులును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా రెడ్డెప్ప, సిద్ధిక్‌లు మృతి చెందారు. శ్రీనివాసులు బెంగళూరులో చికిత్స పొందుతుండగా అతని పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు తెలిసింది. మృతదేహాలను పంచనామాకు తరలించి గుడుపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## 8గంటలకు వస్తేనే రాగిజావ

**- అయోమయంలో ప్రధానోపాధ్యాయులు**

**కోట, మార్చి 22 ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి రాగి జావ అందించారు. ఇందుకు సంబంధించిన సామగ్రిని ముందురోజు సాయంత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. ప్రార్థనకు ముందే.. అంటే 8.45 గంటలకు జావ ఇవ్వాల్సి ఉంటుంది. తయారీ, హాజరు, తదితర ప్రక్రియ పూర్తి చేయాలంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు, వంట మనుషులు ఉదయం 8 గంటలకే పాఠశాలకు చేరుకోవాలి. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇది ఇబ్బందికరమే. అదే విధంగా విద్యార్థులు ఇంటి నుంచి గ్లాసు తెచ్చుకునేలా చూడాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం హడావుడి నిర్ణయం ప్రధానోపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. రాగిజావను 8.45 గంటలకే ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. విద్యార్థులు రాగానే హాజరు తీసుకోవాలి. ఆ లెక్క ప్రకారం రాగిపిండి, బెల్లం పొడి వంటమనుషులకు ఇవ్వాలి. ఆ తర్వాత జావను వండాలి. ప్రార్థనకు ముందు విద్యార్థులకు పంపిణీ చేస్తారు. దీని ప్రకారం విద్యార్థులంతా ఉదయం 8 గంటలకే బడికి చేరుకోవాల్సి ఉంటుందని ఉపాధ్యాయులు చెప్తున్నారు. ఉపాధ్యాయులు, వంట మనుషులు ఒక గంట ముందుగా వస్తే గాని క్రతువు ముందుకు సాగే పరిస్థితి లేదు. చాలామంది విద్యార్థులు గ్రామాల నుంచి వస్తున్నారు. బస్సులు అందుబాటులో లేవు. ఆటోలు, నడువుకుంటూ రావాల్సి ఉంటుంది. ఇదే విషయమై ఎంఇఓ వెంకటసునీల్‌కుమార్‌ను 'ప్రభాతవార్త' వివరణ కోరగా, పాఠశాలల్లో సజావుగానే రాగిజావ పంపిణీ కార్యక్రమం జరుగుతుందని చెప్పుకొచ్చారు.

## ఘనంగా ఉగాది వేడుకలు

**దొరవారిసత్రం, మార్చి 22 ప్రభాతవార్త**



దొరవారిసత్రం మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గ్రామాల్లోని మహిళలు, పిల్లలు, పెద్దలు అందరూ తలస్నానాలు చేసి అనంతరం ఆయా గ్రామాల్లో ఉన్న పోలేరమ్మకు అంబలి పోశారు. అనంతరం కుటుంబ సమేతంగా గ్రామాల్లో ఉన్న పలు దేవాలయాలను దర్శించుకున్నారు. ఉగాది పచ్చడి చేసి ఒకరికొకరు పంచారు. మండలంలోని శ్రీధనమల్లి, పూలతోట, కట్టవపల్లి, తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు కిటకిటలాడారు.

## పేటలో ఘనంగా ఉగాది వేడుకలు ...

**నాయుడుపేట రూరల్ మార్చి 22 ప్రభాతవార్త ;**

నాయుడుపేట మండలంలోని పలుగ్రామాల్లో ప్రజలు ఉగాధి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు.ఉగాధి పండుగ సందర్భంగా గ్రామాల్లో ఉన్న పలుఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.ఉదయం నుండి భక్తులు భక్తిశ్రద్ధతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.గ్రామాల్లో ముఖ్యంగా మహిళలు ఉదిగా పచ్చళ్ళు చేసి పలువురికి పంచిపెట్టడం అన్వయితీగా మారింది.యువత ఒకరిని ఒకరు పలకరించుకుంటూ ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## అదిగదిగో కొత్త ఆశల శోభ

**కోట, మార్చి 22 ప్రభాతవార్త**



డీఎస్సీ 98లో అర్హత సాధించి అప్పట్లో ఉపాధ్యాయ కొలువు పొందని వారికి ఈ ఏడాది మినిమం టైమ్‌స్కేల్ టీచర్లుగా నియమించడానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇటీవలే ఈ కొలువుల భర్తీకి సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 400 మంది అభ్యర్థులు ఈ శోభకృత ఏడాదిలోనే ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి వీరి పాఠాలు వినబడనున్నాయి. నిరుద్యోగులకు ఇది నిజంగా తీపిని పంచిపెడుతుంది.

## పోలీసమ్మ ఆలయాన్ని దర్శించిన వైసీపీ నేత

**ఓజిలి, మార్చి 22 ప్రభాతవార్త** శోభకృత్ నాయ ఉగాది పర్వదినం సందర్భంగా జువ్వలపాలెం గ్రామంలో వెలసి ఉన్న గ్రామదేవత పోలీసమ్మ దేవాలయాన్ని బుధవారం వైసీపీ నాయకులు ముమ్మడ సుబ్బారావు యాదవ్ సందర్శించారు. ఎఎంసి ఛైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, వైసీపీ నాయకులు నాగిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, నాయుడుపేట ఎఎంసి మాజీ డైరెక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాయుడుపేట మండల జెసిఎస్ కన్వీనర్ ఒట్టూరు కిషోర్‌యాదవ్, ఉభయదాత జె.రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఓజిలి గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

## ఆలయాల్లో ఉగాది వేడుకలు

**కోట, మార్చి 22 ప్రభాతవార్త**



కోట మండలంలో వాడవాడలా తెలుగు లోగిళ్లలో కొత్త ఏడాది కళ ఉట్టిపడింది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. పండుగ సంబరాలు సంప్రదాయబద్ధంగా సాగాయి. మండలంలోని విద్యానగర్‌లో సాయిబాబా మందిరంలో, కోటలోని కోటమ్మ ఆలయంలో, నెల్లూరుపల్లి కొత్తపాలెం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో, చిట్టేడులో కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కోటలోని కోటమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో విచ్చేశారు. కోటలో ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమాన్ని తూపిలి రాధాకృష్ణారెడ్డి కొనసాగిస్తున్నారు. అప్పట్లో ప్రారంభించిన ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమానికి గ్రామంలోని చిల్లర దుకాణాల యజమానులు చింతపండు, బిల్లం, ఉప్పు, కూరగాయలు, పచ్చిమిర్చి, మామిడితోటల యజమానులు మామిడికాయలు ఉచితంగా ఇచ్చేవారని ఆయన గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణే ధ్యేయంగా, పర్వదినాల నిర్వహణ లక్ష్యంగా ప్రతి ఏటా కోటలోని శ్రీవీరాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉగాది పచ్చడి తయారు చేసి ప్రజలకు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా దాతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## పేటలో జోరుగా కోడిపందేలు ...

**లక్షల్లో బెట్టింగులు -పట్టించుకోని పోలీసులు ...**

**నాయుడుపేట రూరల్ మార్చి 22 ప్రభాతవార్త ;**

నాయుడుపేట మండలంలోని మేనకూరు,బీమవరం,మాభాక,పూడేరు,చిలమత్తూరు తదితర గ్రామాల్లో జూదగాళ్ళు కోడిపందేలు నిర్వహిస్తున్న సంబందిత పోలీసులు పట్టించుకోవడంలేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు.మండలంలో సోమ,మంగళ,ఆదివారం ఏదొఒకప్రాంతంలో కోడిపందేలు వేస్తున్నారు. ముఖ్యంగా కోడిపందేలకు స్థానికులే కాకుండా ఇతరప్రాంతాలైన తమిళనాడు,తిరుపతి,తడ,ప్రాంతాలకు చెందిన జూదరులు కోడిపందేలకు రావడం లక్షల్లో బెట్టింగులు నిర్వమించడం జరుగుతుంది.ఈవిధంగా విచ్చలవిడిగా కోడిపందేలు నిర్వహించడం వల్లన యువత జూదనికి అలవాటుపడి పక్కదారి పడుతున్నారు.కోడిపందేలు నిర్వహించే ప్రాంతంలో జూదరులు లక్షల్లో కోళ్ళపై బెట్టింగులు కట్టడం మధ్యం సేవించి ఘర్షణలు పడుతున్న పోలీసులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. కోడిపందేల్లో బెట్టింగులు కట్టి లక్షలు రూపాయలు పోగొట్టుకొని వారికుటుంబాలను వీదిన పడేస్తున్నారు.ఇప్పటికైనా పోలీసలు స్పందించి కోడిపందేలు,బెట్టింగులు కట్టకుండా నియంత్రించాలని పలువురు గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

## ఆలయాలలో ఉగాది పర్వదిన వేడుకలు

**చిల్లకూరు మార్చి 22 ప్రభాతవార్త**



మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసియున్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శోభకృతనామ ఉగాది పర్వదినం సందర్భంగా ముత్యాల చీర అలంకారంలో భక్తులు పెద్ద ఎతు_న అమ్మ వారి_న దర్శనమిచ్చారు. అదే విధంగా కలవకుండ గ్రామంలో కొండపైన వెలసియున్న శ్రీ లక్ష్మీనర సింహస్వామి అమ్మవార్లకు ఉదయం అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అర్చకులు శోభకృతనామ సంవత్సరం ఉగాది సందర్భంగా భక్తులకు పంచాంగ శ్రవణాన్ని చదివి వినిపించారు.భక్తులు భవిష్యత్తు వివరించారు.ఈ ఏడాది ప్రజ లందరు సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని ఆశీస్సులు ఎల్ల వేళలా ఉండాలని ప్రజల తరపున కోరడం జరిగిందని అన్నారు.ఈకార్యక్రమాలకు ఉభయకర్తలుగా ఏరూరు ,కొత్తపాళెంకి చెందిన డి.అశోక్ కుమార్, సౌమ్య దంపతులు వ్యవహారించారు.ఈ కార్యక్రమాలను ఆలయ ఛైర్మన్ కందల ఆనంద్ ,ఇఒ కెనవీన్‌కుమార్‌పర్యవేక్షణలోనిర్వహించారు. వీరితోపాటుమాజీ మార్కెటింగ్‌ఛైర్మన్ కలవ కొండ,తూర్పుక నుపూరు.తమ్మినపట్టణంగ్రామాలలోఆలయాల అభివృద్ధి ప్రదాత ఎరటపల్లి జానకి రామిరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా వైసీపీ నేత సతీష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**గూడూరు, మార్చి 22 ప్రభాతవార్త**



గూడూరు పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు మనోబోలు సతీష్‌రెడ్డి 43వ జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహించారు. స్థానిక బాలాజీనగర్ కూడలి ప్రాంతంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగ పల్లి వరప్రసాద రావు ముఖ్య అతిథిగా హాజరై అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకు కట్ చేయించి సతీష్‌రెడ్డికి తినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీకి సతీష్‌రెడ్డి విధేయుడుగా ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎబి ఛైర్మన్ దేగపూడి కృష్ణారెడ్డి, వైసీపీ నాయకులు ఉన్నం అనిష్‌నాయుడు, పెరికల అశోక్‌యాదవ్, దుగ్గన వినీష్‌యాదవ్, వినోద్‌కుమార్, నాని, రాజేష్, శేషు, శంకరయ్య, సునీల్, ధనుంజయరావు, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది వేడుకల్లో పాల్గొన్న గూడూరు ఆర్డీఓ

**గూడూరు, మార్చి 22 ప్రభాతవార్త**



తిరుపతి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో బుధవారం జరిగిన ఉగాది వేడుకల్లో గూడూరు ఆర్డీఓ మీసాల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. గూడూరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు పోటీపడి ముందుకు సాగాలని ఆయన తిరుమల వెంకటేశ్వరస్వామిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఉగాది పంచాంగం శ్రవణం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన గూడూరు నియోజకవర్గంలో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సుఖసంతోషాలతో అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆయన దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం తిరుపతి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జెసి బాలాజీ, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ప్రొటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. శోభకృత్ నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆర్డీఓ ఆకాంక్షించారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**ఓజిలి, మార్చి 22 ప్రభాతవార్త**



ఓజిలి మండలం భట్లకనుపూరు గ్రామంలో సామూహికంగా నవధాన్యాలు సాగు పెలెటేజేషన్ చేయడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ మునిరత్నం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామూహికంగా నవధాన్యాలు సాగు చేయడంపై, భూమిలో చల్లడం వలన కలిగే ప్రయోజనాల గురించి రైతులకు తెలియజేశారు. తొలకరి వర్షాలు పడకముందు రైతులందరూ నేలలో30 రకాలకు పైగా విత్తనాలు వేసుకొని సాగుచేయడంతో నేలలో కర్బన శాతం పెరిగి నేల సారవంతంగా మారుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, మహిళా సంఘాల సభ్యులు కలిసి ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లోని రైతులకు బుధవారం ప్లకార్డులు చేతపట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంటి వీరరాఘవయ్య మాట్లాడుతూ నవధాన్యాలతో పాటు 32 రకాల విత్తనాలు పచ్చికొట్ట ఎరువులుగా వేసి కలియదున్నడం వలన సూక్ష్మ పోషకాలు పెంపొందించి జీవ వైవిధ్యం ఏర్పడి ప్రధాన పంటకు పోషకాలు అందుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐబిపిఆర్‌పి జైతున్, బి యూనిట్ ఇన్‌ఛార్జి కె.పుష్పలత, ఎల్‌టు ఎం.అజిత, టి.యామిని, ఎన్.చెంచమ్మ, సిఆర్‌పి శ్రావిక, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## రచనలు సమాజాన్ని ప్రభావితం చేయాలి

**-విశ్రాంత డిఎస్పీ సుకుమార్‌బాబు**

**పుంగనూరు, మార్చి 22 ప్రభాతవార్త:**



కవుల రచనలు సమాజాన్ని ప్రభావితంచేసి దిశానిర్దేశంచేసేలా ఉండాలని అటువంటి రచనలనకే గౌరవం ఉంటుందని విశ్రాంత డిఎస్పీసుకుమార్‌బాబు అన్నారు. మంగళవారం సాయంత్రం పుంగనూరు రచయితల సంఘ అధ్యక్షుడు పరాంకుశం నాగరాజ,గౌరవాధ్యక్షుడు దాసరికృష్ణారెడ్డి, కార్యదర్శి సాల్వరాజు సతీష్‌ల అధ్వర్యంలో కవిసమ్మేళనం కార్యక్రమం జరిగింది. కనుమకుంట సుకుమార్‌బాబు సాయంతో ఏర్పాటుచేయబడిన ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామాయణకాలం నుంచి నేటి వరకు సమాజాన్ని మేలొ్కలిపింది కవుల రచనలేన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.డాక్టర్ శివ మాట్లాడుతూ ప్రపంచమంతా ఒక ఎత్తయితే,కవులు మరో ఎత్తని కవులు,రచయితలు విశ్వవ్యాప్తంగా రచనలు చేయాలన్నారు. ప్రముఖ దంతవైద్యులు శరణ్‌కుమార్ మాట్లాడుతూ కవులు,కళాకారులను సదాప్రోత్సాహించేందుకు తాము సిద్దంగా ఉన్నామన్నారు. తిరుపతి సంకల్ప దంతశస్త్రచికిత్సా నిపుణులు హరీష్ మాట్లాడుతూదైనందిక జీవితంలో ఎపుడూ హడావుడిగా ఉండే తమకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉత్తేజితాన్నిస్తాయన్నారు. ఈసందర్భంగా కవులు బత్తనపల్లి మునిరత్నంరెడ్డి, గంగులమ్మ, హసీనాబేగం,సాల్వరాజు సతీష్,జమునారెడ్డి,హేమలత, గాయత్రి,రామలింగప్ప,వాహిదా,కళాకారుడు జయచంద్ర తదితరులను సత్కరించి మెమెంటోలను బహుకరించారు. వీరిని రెడ్డిజనసంక్షేమ సంఘం,ఉయా ల్యలవాడ నర్సింహారెడ్డి సంస్థల ప్రతినిధులు త్రిమూర్తిరెడ్డి,మహీపాల్‌రెడ్డిలు శాలువలతో సత్కరించారు.

## ఈచర్ వాహనం బోల్తా.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు

**కుప్పంరూరల్, మార్చి 22 ప్రభాతవార్త**

కుప్పం - మల్లానూరు మార్గంలో వానగుట్టపల్లి వద్ద ఈచర్ వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కుప్పం నుంచి ఈచర్ వాహనం తిరుపత్తూరుకు వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. ప్రమాదంలో గాయపడ్డ డ్రైవర్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించారు.

## కంచికామాక్షిదేవి అలంకరణలో నల్లగంగమ్మ అమ్మవారు

శ్రీకాళహస్తి, మార్చి 21 ప్రభాతవార్త



పట్టణంలోని బహదూరుపేట తెట్టు వద్ద వెలసిన నల్లగంగమ్మ అమ్మవారికి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారు కంచికామాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి చుట్టు ధవనంతో చక్కగా అలంకరించారు. అమ్మ వారిని దర్శించుకోవడానికి పలువురు భక్తులు విశేష సంఖ్యలో హజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఉగాదిపచ్చడితో పాటు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కంటారమేష్, కమిటీ సభ్యులు నారాయణ, ప్రదీప్, అనిల్, దిలీప్, రాజేంద్ర, కృష్ణమూర్తి, యాదగిరి, పూజారి శంకరయ్య, రాజేష్‌గురుకుల్, గుణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూలసంఘ అధ్యక్షుని పుట్టినరోజు వేడుకలు

శ్రీకాళహస్తి, మార్చి 22 ప్రభాతవార్త



పట్టణపూలసంఘ వర్తక వ్యాపారుల సంఘం అధ్యక్షులు నంగినేటిసుబ్రమణ్యం పుట్టినరోజు వేడుకలను తేరువీధిలో వెలసిన భక్తకన్నప్ప ఆలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో వెలసిన భక్తకన్నప్ప స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వర్తకవ్యాపారులు వంకాయల సిద్దులయ్య, కోనేటిసిద్దులయ్య, జీవ, వంశీ, అనుదీప్, వంశీకృష్ణ, భీమవరంసురేష్, 24వ వార్డు మాజీ కౌన్సిలర్ బీమాలమునికృష్ణయ్యల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కేక్‌ను కట్‌చేసి పంపిణీచేశారు. అనంతరం ఆయన్ను దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## భక్తకన్నప్ప ఆలయం వద్ద అన్నదానం

శ్రీకాళహస్తి, మార్చి 22 ప్రభాతవార్త



పట్టణంలోని తేరువీధిలోవెలసిన భక్తకన్నప్ప ఆలయం వద్ద ఉగాది పర్వదినం సందర్భంగా పూలసుబ్రమణ్యం(పూలచిన్నబ్బయ్య) ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు విచ్చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ శోభకృత్ నామసంవత్సరంలో తెలుగు ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని అన్నదాతలు సంతోషంగా ఉండాలని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కంటా ఉదయ్‌కుమార్, మునికృష్ణ, పూలబాబు, మణి, బాచి, చిన్న, సిద్దులయ్య, అయ్యప్ప, అశోక్, వెంకటరత్నం, హేమకుమార్, శ్రీనివాసులు, వంశీ, జగదీష్, వినోద్, జిత్తు, యోగి, బాలగౌడ్, సునీల్, ప్రసాద్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంఎల్ఏకు ఉగాది శుభాకాంక్షలు

శ్రీకాళహస్తి, మార్చి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీనాయుడు కు వైకాపా నాయకుడు కోళ్ళూరుహరనాథ్ నాయుడు, మాజీ మున్సిపల్‌కౌన్సిలర్ కోళ్ళూరుజయ, మొగరాలగణేష్‌లు ఆయన్ను దుశ్శాలువతో సత్కరించి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీవీనాయుడు మాట్లాడుతూ కొత్త తెలుగు సంవత్సరంలో ప్రజలు, అన్నదాతలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

## శివయ్య సేవలో మైన్స్ ఎండి

శ్రీకాళహస్తి, మార్చి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ వీజీ వెంకటరెడ్డి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో ఎఇఓ సతీష్‌మాలిక్ సారధ్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వాగతం పలికిన వారిలో ఎంజిఎం అధినేత మల్లికార్జున్ నాయుడు, సుధాకర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మెన్ షేక్ సిరాజ్‌బాషా ఉన్నారు. ఎండి ఆలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి వేదపండితులచే ప్రత్యేకా ఆశీర్వచనాలు అందించారు.

## ఆలయాల్లో ఉగాది వేడుకలు

పుత్తూరురూరల్, మార్చి 22 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణం, మండల పరిధిలోని ఆలయాల్లో శోభకృత్ నామ సంవత్సరం (ఉగాది) సందర్భంగా పలు ఆలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో మూల ఉత్సవ విగ్రహాలకు, పరివార దేవతలకు అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఆలయ చైర్మన్ కొడగంటి రమేష్‌బాబు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే శ్రీ ద్రౌపదీ దేవి సమేత శ్రీ ధర్మరాజులస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదా కార్యక్రమం నిర్వహించారు. ఉభయ దాతగా ఈశ్వరాపురం గ్రామానికి చెందిన ప్రముఖ శల్య వైద్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ డా.ప్రతాప్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, లారీ మోహన్, కమిటీ సభ్యులు, అలాగే శ్రీ సదాశివన ఆలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామికి శ్రీకృష్ణ భగవానుడికి శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయం, ఓంశక్తి శ్రీ కావమ్మ మారయ్య, బజారు వీధిలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి, ఆరేటమ్మ రామలింగేశ్వర స్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పుత్తూరులోని షిరిడీ సాయిబాబా, సదాశివేశ్వరుని స్వామి ఆలయం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు.

## ఘనంగా ఉగాది సంబరాలు

విజయపురం, మార్చి 22 ప్రభాతవార్త :



మండలంలో తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పన్నూరులో ఆనందవల్లి ఇష్టకామేశ్వరస్వామి ఆలయంలో బాలబ్రాహ్మణ శర్మ ఉగాది శ్రవణం పఠించారు. జగన్నాధపురంలో శ్రీరామనామ క్షేత్రంలో అర్చకులు రామ్‌ప్రసాద్‌స్వామి, విజయపురంలో వందవాసి మహేష్‌శర్మ ఉగాది పచ్చడి పంచి పంచాంగం పఠించారు. పలువురు భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.

## వేదంలో "ఓపోఫైండ్‌ఎన్2ఫ్లిప్" మొబైల్ ఆవిష్కరణ

తిరుపతి, మార్చి 22ప్రభాతవార్త:



తిరుపతిలోని సెంట్రల్‌పార్కులో ఉన్న వేదంమొబైల్స్‌లో "ఓపోఫైండ్‌ఎన్ 2ఫ్లిప్" మొబైల్ ఆవిష్కరణ చేశారు. నూతన మొబైల్ ఫోన్‌ను తాశీల్దార్ వెంకటరమణ, డిటి జీవన్‌కుమార్ ఆవిష్కరించి, వేదం మొబైల్స్ అధినేత ఆముదాల ప్రభాకర్ సేవలను, ఖాతాదారుల నమ్మకాన్ని కొనియాడారు.

## ప్రజలకు మంచి జరగాలి

:గుండాలగోపీనాథరెడ్డి

తిరుపతి, మార్చి 22ప్రభాతవార్త:



తెలుగునూతన సంవత్సరం శోభకృత్ నామ ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం రాయలసీమరంగస్థలి ఆధ్వర్యంలో షడ్రుచుల ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ప్రజలకు ఉగాది సకల శుభాలు కలగాలని రాయలసీమరంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, సభ్యులు ఆకాంక్షించారు.

## శ్రీ బాలాజీలో ఉచిత వైద్యం

రేణిగుంట, మార్చి 22 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం కొత్త విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో ఉన్న శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీ ఆస్పత్రి రీసెర్చ్ సెంటర్‌లో పది రోజులు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు డైరెక్టర్ హెచ్‌ఆర్ డా. నాగరాజు, జేఈవో డా. ఎం.నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఉచిత సేవలు ప్రారంభించామన్నారు. 250 పడకలను 350కు పెంచామన్నారు. ఈ పది రోజులు అన్ని రకాల వైద్యసేవలు, బీపీ, షుగర్, ఈసీజీ, ఎక్సరే తదితర టెస్టులు, కొన్ని రకాల రక్త పరీక్షలతోపాటు ఖరీదైన సిటీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లో డాక్టర్ సలహా మేరకు ఉచితంగా చేస్తామన్నారు. ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు ఉంటుందన్నారు. అవసరమైతే ల్యాండ్‌లైన్ నెంబరు 0877 2266701, టోల్ ఫ్రీ నెంబరు 1800 424 9999 నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

## పంచాయతీ అనుమతులు లేకుండా టెండర్లు ఎలా పిలుస్తారు...?

రేణిగుంట, మార్చి 22 ప్రభాతవార్త:



పంచాయతీ అనుమతులు లేకుండా ఆర్టీసీ అధికారులు దుకాణాలు నిర్మించుకోవడానికి టెండర్లు ఎలా పిలుస్తారని బుధవారం రేణిగుంట మేజర్ పంచాయతీ సర్పంచ్ నాగేశం ప్రశ్నించారు. శ్రీవారికి ముఖ ద్వారమైన రేణిగుంట పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌కు దక్షిణం వైపు ఉన్న దుకాణాలను భక్తుల సౌకర్యార్థం గతంలో తొలగించారన్నారు. అప్పటి నుంచి రోడ్డు విశాలంగా మారి భక్తులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉందన్నారు. అయితే ఆర్టీసీ అధికారులు అక్కడ దుకాణాలు నిర్మించుకోవడానికి టెండర్లు పిలవడానికి ఆయన తప్పు పట్టారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మండల వైసీపీ ఇన్‌చార్జి పవిత్రరెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి ద్వారా ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులకు స్వీట్ బాక్సులు, జాకెట్లు వార్డు మెంబర్లు సమక్షంలో పంపిణీ చేశారు.

## శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో అన్నీ శుభాలే..

తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 22 ప్రభాతవార్త:



శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో అన్నీ శుభాలే కలుగుతాయని శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ప్రధాన అర్చకులు, పంచాంగ శ్రవణ కర్త జోష్ల శ్రీ రామకృష్ణ శర్మ అన్నారు. బుధవారం తెలుగు సంవత్సరాది ఉగది వేడుకలను ప్రెస్‌క్లబ్ నందు ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం పంచాంగ ప్రవచనాన్ని పఠించారు. ఈ శోభకృత్ నామ సంవత్సరంలో కొందరు రాజకీయ నాయకులు, నాయకత్వం వహించే కొంతమంది వ్యక్తులు ఒడిదుడుకులను ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. ఏడాదంతా వర్షాలు సంవృద్ధిగా ఉంటాయని, రెండు పంటలు పుష్కలంగా పండి రైతుల ఇళ్లల్లో ఆనందం నెలకొంటుందన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అన్ని రంగాలు అభివృద్ధి వైపు పరుగులు పెడతాయన్నారు. అనంతరం రాశుల వారీగా ఈ ఏడాది ఫలితాలను ఆయన వివరించారు. పంచాంగ శ్రవణ కర్త శ్రీ రామకృకృష్ణ శర్మతో పాటు బ్రాహ్మణ కార్పొరేషన్ సభ్యుడు చిత్రపు రామకృష్ణ శేషగిరిరావు, చిగోరా ఆధ్యాత్మిక సంస్థ అధ్యక్షుడు చిత్రపు హనుమంతరావులను ప్రెస్‌క్లబ్ కమిటీ తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జె.భాస్కర్‌రెడ్డి, బాచంద్ర, కోశాధికారి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రమేష్‌కుమార్, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శోభకృత్ నామ ఉగాది శుభాలు కలిగించాలి.

జన్మస్థల శివాలయ అధ్యక్షుడు కొర్లగుంట గురునాథ రెడ్డి

రామచంద్రాపురం, మార్చి 22 ప్రభాతవార్త:



శోభకృత్ నామ ఉగాది ప్రజలందరికీ శుభాకలిగించాలని జన్మస్థల శివాలయ కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు కొర్లగుంట గురునాథ రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం రేకలచేను సమీపంలోని జన్మ స్థల శివాలయంలో ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో తయారు చేసిన ఉగాది పచ్చడి పరిసర గ్రామాలకు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణంలో వెలసియున్న అక్కగార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దీక్షా ఈవెంట్ వారిచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి కీచకవధ పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. పరిసర గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు హాజరై కార్యక్రమాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో కొర్లగుంట నరంహారెడ్డి, కొర్లగుంట రఘునాథ రెడ్డి, కె.రాజశేఖర్‌రెడ్డి, బండి యర్రమ రెడ్డి, కె.బాలచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది తెలుగువారి పండుగ

ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ

రామచంద్రాపురం, మార్చి 22 ప్రభాతవార్త:



ఉగాది తెలుగవారి తొలి పండుగ అని ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ అన్నారు. బుధవారం ఉగాది పండుగను పురస్కరించుకుని సి.కె.పల్లి పంచాయతీ, గొల్లపల్లి సమీపంలో గల సురభి గోశాలలో వృషభాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సరం, చైత్ర మాసం తొలి పాడ్యమి రోజున ఉగాది పండుగ జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. తెలుగు నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఎదగాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మోమెడి లీలాకృష్ణ, దామోదర్ రెడ్డి, బలరామిరెడ్డి, దొరస్వామి రెడ్డి, యర్రమరెడ్డి, మురళి, సదాశివ, తదితరులు పాల్గొన్నారు.

## సాయిమందిరంలో ఉగాది సంబరాలు:ఊరేగింపు

శ్రీకాళహస్తి, మార్చి 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి చెన్నై రోడ్డులో వెలసిన గురుసాయిబాబా ఆలయం, కర్ణాలవీధిలో ఉగాది సంబరాలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది లాగే సాయినామ సంకీర్తన నిర్వహించారు. ఈ ఏడాది బాబా ఆలయాన్ని పూలముస్తాబులు అబ్బో అనిపించాయి. బంగారు సింహాసనంపై వెలసిన బాబాను ధార్మిక భావంతో పూజించారు. కాగా బాబా ఉత్సవ మూర్తిని అఖండ సంకీర్తనలతో పట్టణంలో ఊరేగించారు. పలువురు భక్తులు బాబాను దర్శించుకున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయం తరపును నూతన పంచాంగం

శ్రీకాళహస్తి, మార్చి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం మొదటి సారి పంచాంగాన్ని బుధవారం ఉదయం ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయంఎదురుగా స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డిముఖ్యఅతిధిగాహాజరై ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబందించి ప్రత్యేక పంచాంగాన్ని ఏర్పాటు చేయాలని వేదపండితుల సూచనలతో తయారు చేయించామన్నారు. శోభకృత నామ సంవత్సర యుగాది సందర్భంగా దేవస్థానం అస్తాన సిద్ధాంతి కె.ఎల్.సత్యనారాయణ శర్మ తయారు చేసిన పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఏర్పాట్లను ఆలయ ఇఓవికె సాగర్‌బాబు పర్యవేక్షించారు. ఎంతో కాలంగా శ్రీకాళహస్తీశ్వరాలయం క్యాలండర్లను ముద్రిస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి క్యాలండర్‌ను టిటిడి స్థాయిలో తయారు చేయించారు. ఈ కార్యక్రమాల్లో పాలకమండలి సభ్యులు కొండూరు సునిత, రమాప్రభ, లక్ష్మీ, చెంచులత, దాసరి జయమ్మ, ప్రత్యేకాహ్వానితులు నీలా, శ్రీదేవి, శోభ, దేవస్థానం ఎఇఓ సతీష్‌మాలిక్, ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణం, ఎఇఓ లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు, పిఆర్‌ఓ కిషోర్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు కొండూరు నంద, భాస్కర్ ముదిరాజ్, లక్ష్మీపతి, రమణయ్యానాయుడు, గోపిగౌడ్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామికి వెండిశెటారి బహూకరణ

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామికి బుధవారం యుగాది సందర్భంగా శ్రీకాళహస్తికి చెందిన తేరు వెంకటరమణయ్య కుటుంబసభ్యులు తమ తల్లిదండ్రుల పేర వెండి శెటారిని అందించారు. తిరుమలేశుని దర్శనానికి రద్దీ రోజుల్లో వెళ్ళలేని వారు చరిత్రాత్మక ప్రసిద్ది చెందిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకోవటం ఆనవాయితిగా వస్తుంది. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి వాసులు తొండమాన్‌పురానికి తరచూ వస్తుంటారు. 250 గ్రాముల వెండి శెటారి రూ.22వేలు విలువ కల్గిన ఉరువును అందించారు. ఈ కార్యక్రమాల్లో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్‌రెడ్డి, సదాశివయ్య, అర్చకులు రమణస్వామి, జయస్వామిలకు అందించారు. దానిని స్వామి వారికి అలంకరించి పూజలు నిర్వహించారు. దాతలకు ప్రత్యేక వేదపండితుల ద్వారా ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

## బొక్కసం పాళెంలో యుగాది పూజలు:

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం బొక్కసం పాళెంలో వెలసిన కోదండ రామేశ్వరాలయంలో యుగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం ఆలయంలో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేసారు. అంతేకాక స్వామి అమ్మవార్లను చక్కగా అలంకరించి భక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు తండోపతండాలుగా దర్శించుకున్నారు. ఈకార్యక్రమాల్లో పూజారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వ్యభిచారం కేసులో నిందితుల అరెస్టు

తిరుపతి క్రైం, మార్చి 22, ప్రభాతవార్త




తిరుపతి నగరంలో అసాంఘిక కార్యకలాపాలపై తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ఆదేశాలతో ఈస్ట్ డిఎస్పి మురళికృష్ణ ఆధ్వర్యంలో నగరంలో లాడ్జిలపై ఈస్ట్ సిఐ శివప్రసాద్ రెడ్డి తన సిబ్బందితో దాడులు చేపట్టారు. పెద్దకాపు లే అవుట్ శ్రీ పద్మావతి రెసిడెన్సి లాడ్జి నందు వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వ్యభిచార నిర్వహకులు భువనేశ్వరి ఆమె తమ్ముడు జి. సురేష్, ఆర్. గోపికృష్ణ, వి. సంతోష్, విటులు అరుణ్‌కుమార్, బుక్ కిషోర్, కంచర్ల వరణ్‌లను అరెస్టు చేశారు. యువతులను కౌన్సిలింగ్ ఇచ్చి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్పి మాట్లాడుతూ తిరుపతి నగరం ప్రసిద్ధిగాంచిన మహా పుణ్యక్షేత్రమని వేల సంఖ్యలో దర్శనానికి భక్తులు వస్తుంటారని అదునుగా భావించిన కొందరు సులభంగా డబ్బు సంపాదించాలని ఉద్దేశంతో అశ్రయంగా కార్యకలాపాలు చేపట్టినట్లు గుర్తించమన్నారు. అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బిసి సంక్షేమ సంఘం గ్రామ స్థాయి నుండి బలోపేతం కావాలి

-తిరుపతి అధ్యక్షుడు నాగరాజు గౌడ్ పిలుపు

తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 22 ప్రభాతవార్త:

బిసి సంక్షేమ సంఘం ఒక రాజకీయ శక్తిగా మారుతున్న తరుణంలో జిల్లాలో అలాగే అన్ని మండలాల్లో గ్రామ స్థాయి నుండి బలోపేతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిసి సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు కె.నాగరాజు గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి మండల కమిటీ నియామకం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి సోమశేఖర ఆచారిల ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో శ్రీకాలహస్తి మండల అధ్యక్షుడిగా కోనాటి చెంచు బత్తయ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా వీర రాఘవులు, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా అద్దంకి మునిశేఖర్‌లను ఎన్నుకుని వారికి నియామక పత్రాలు అందచేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖరాచారి మాట్లాడుతూ మనదంతా బిసి కుటుంబమని, బిసి లందరూ ఏకతాటిపైకి వచ్చినప్పుడే మన బిసిల పార్టీని బలోపేతం చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మధు మార్గాచార్యుల, బి.జయచంద్ర, జడపల్లి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## తిరువణ్ణామలైకి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

-రిజర్వేషన్ సౌకర్యాన్ని వినియోగించుకోండి -డిపిటిఓ చెంగల్‌రెడ్డి పిలుపు

తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 22 ప్రభాతవార్త:

ఏప్రిల్ 5వ తేదీ పౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడులోని తిరువణ్ణామలై గిరి ప్రదక్షణ విశిష్టత దృష్ట్యా ప్రయాణీకుల సౌకర్యార్థం జిల్లాలోని వివిధ డిపోల నుండి 16 ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు ఏపిఎస్‌ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి(డిపిటిఓ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి డిపో నుండి 4, మంగళం డిపో 1, అలిపిరి నుండి 2, శ్రీకాళహస్తి 1, సత్యవేడు 1, వెంకటగిరి 2, గూడూరు 2, వాకాడు 2, సూళ్లూరుపేట డిపో నుండి 1 తో కలిపి మొత్తం 16 ప్రత్యేక సర్వీసులను నడపడం జరుగుతుందని ఆయన వివరించారు. భక్తులు ఆయా ప్రాంతాల నుండి తిరువణ్ణామలైకి వెళ్లడానికి, తిరిగి రావడానికి ముందస్తుగా టికెట్లు పొందటానికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. మరిన్ని వివరాలకు తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డి.రామచంద్రనాయుడు(ఫోన్ నెం:9959225684)ను సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాల్సిందిగా డిపిటిఓ చెంగల్‌రెడ్డి కోరారు.

## ఉగాది పర్వదినంతో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 22 ప్రభాతవార్త:

శ్రీ శోభకృత నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకుని మండలంలోని బుచ్చినాయుడు కండ్రిగ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, నీర్ప కోట శ్రీ చంగాలమ్మ రామాంజనేయ దేవాలయంలో శ్రీ పచ్చలమ్మగుడి, ప్రసన్న ఆంజనేయ దేవాలయంలో, మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొని ఉన్న దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పర్వదినం సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో అందుబాటులో దేవాలయం చేరుకుని పూజా కార్యక్రమం నిర్వహించి దైవ దర్శనం చేసుకున్నారు.

## ఉగాది శుభాకాంక్షలు తెలిపిన గాలి భానుప్రకాష్

నగరి, మార్చి 22 ప్రభాతవార్త:

గడిచిన శ్రీ శుభకృత నామ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ వస్తున్న శ్రీ శోభకృత నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నగరి నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆయన కోరారు.

## ఆలయాల్లో వైభవంగా ఉగాది పూజలు

నగరి, మార్చి 22 ప్రభాతవార్త:



నగరి మున్సిపల్, మండల పరిధిలోని ఆలయాల్లో బుధవారం ఉగాది పూజలు వైభవంగా జరిగాయి. కరియమాణిక్యస్వామి ఆలయంలో శోభకృత్ నామ ఉగాదిని పురస్కరించుకుని విశేష పూజలు చేయగా పురోమితులు ప్రసాద్‌శర్మ పంచాంగ శ్రవణం చేశారు. రాశుల వారిగా ఏర్పడు ఫలితాలను వివరించారు. కొత్త సంవత్సరం పేరులోనే శోభ ఉండడం వల్ల ఈ సంవత్సరం దేశంలో అన్ని విధాలుగా శోభిల్లుతూ ఉంటుందనిపేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పంచాంగ శ్రవణం విని శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్యస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారి వెంకటరమణ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ పరిధి టీఆర్ కండ్రిగలోని కన్నుల దేవత దేశమ్మ దేవాలయంలోని బాలాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ సమీపం గల శ్రీ ప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక అలంకారం చేయగా భక్తులను ఆకట్టుకుంది. కరకంఠేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రదక్షిణం చేసి స్వామిని దర్శించుకుని కర్పూర హారతులు స్వీకరించారు. పాత భజన గుడి వీధిలోని కోదండరామాలయంలోను, బేరివీధిలోని రామాలయంలోను ఉగాదిని పురస్కరించుకుని సీతారామలక్ష్మణ ఆంజనేయస్వాములకు చేసిన అలంకరణలు ప్రత్యేకంగా నిలిచాయి. పట్టణ పరిధిలోని ఓంశక్తి ఆలయంలోను, సాయిబాబా ఆలయంలోను, హనుమంతేశ్వర ఆలయంలోను ఉగాది పూజలు నిర్వహించారు.

## జాతీయ రహదారి అధికారుల మొండి వైఖరి నశించాలి

నగరి, మార్చి 22 ప్రభాతవార్త:

జాతీయ రహదారి అధికారుల మొండివైఖరి నశించాలన ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలతో కలసి జాతీయ రహదారుల కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుత్తూరు, చెన్నై ఫోర్‌లైన్ రోడ్లను వేయకపోవడం, రోడ్డు మరమ్మతుల పేరుతో ప్రమాద సూచికలను ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతోందన్నారు. నెల రోజుల క్రితంజాతీయ రహదారుల దారులు మరమ్మతులు పేరుతో రోడ్లు వేయడం జరిగింది. రోడ్డు వేసిన తరువాత అధికారులు రోడ్లు పైన వైట్ మార్కింగ్, ప్రమాద సూచిక బోర్డులను ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు రోడ్డుపై వైట్‌లైన్ మార్కింగ్‌లు వేసి ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బాషా, రూప్ కుమార్, మురళి, విజయకుమార్, శేఖర్, మణి, బాబు, అలీ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన క్రికెట్ టోర్నీ

రేణిగుంట, మార్చి 22 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం తూకివాకం మైదానంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో ఎంఎస్ఆర్ క్రికెట్ టోర్నీ వైభవంగా ప్రారంభమైంది. తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి టోర్నీని ప్రారంభించారు. 10 ఓవర్ల లీగ్ పద్ధతిలో టోర్నమెంట్ నిర్వహిస్తు న్నారు. దాదాపు 60 నుంచి 70 టీములు మైదానంలో తలపడ నున్నాయి. టోర్నీ రెండు వారాల పాటు జరుగుతాయని టీములు పెరిగితే మరో కొద్ది రోజులు పొడిగిస్తామని నిర్వాహకులు తిరుపతికి చెందిన ఎక్సపర్ట్ మొబైల్స్ డిజిటల్ అధినేత ఎం.కిషోర్‌రాజు, సి.చక్రధర్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ యువత చెడు మార్గం వైపుకు మొగ్గు చూపకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవడానికి టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. విన్నర్స్‌కు రూ.21,111లు, రన్నర్స్‌కు రూ.11,111లు నగదు పారితోషకంతో పాటు కప్పు, షీల్డ్ ఇస్తామన్నారు.

## ఎమ్మెల్యే స్ఫూర్తితో పేదలకు అండగా ఉంటా - సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి

రేణిగుంట, మార్చి 22 ప్రభాతవార్త:



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని పేదలకు అండగా ఉంటానని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సర్పంచ్ వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన ఎస్సీ, ఎస్టీలకు వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఇంటి, కొళాయి పన్నులను కట్టి రసీదులను అందజేశారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర నేత దేవరాజులు, ఎస్సీ నాయకురాలు అరుణను సర్పంచ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయి మురళీకృష్ణ, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

## రూ.3 లక్షల కర్నాటక టెట్రా ప్యాకెట్లు పట్టివేత



గుడిపాల, మార్చి 22 ప్రభాతవార్త: చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో గుడిపాల ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఐడి పార్టీ సిబ్బంది బుధవారం తెల్లవారు జాము 3 లక్షల రూపాయల విలువైన కర్నాటక టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొన్నారు. ఈ ఘటనలో పోలీసులు 3 లక్షల రూపాయల విలువైన ఒక వాహన ంతో పాటు ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. వివరాలిలా వున్నాయి. డిఎస్పీ శ్రీనివాసులుమూర్తికి కర్నాటక టెట్రా మద్యం ప్యాకెట్ల రవాణాపై ముందస్తు సమాచారం అందడంతో ఆయన వెస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డిని అప్రమత్తం చేశారు. ఈ మేరకు సిఐ శ్రీనివాసులురెడ్డి గుడిపాల ఎస్ఐ రాజశేఖర్, ఐడి పార్టీ సిబ్బంది బుధవారం తెల్లవారుజాము చిత్తూరు-వేలూరు రహదారిలో ఎంసిఆర్ క్రాస్ వద్ద నిఘా వుంచారు. ఈ క్రమంలో ఒక కారును నిలుపుదల చేసి తనిఖీ చేయగా అందులో కర్నాటక టెట్రా మద్యం ప్యాకెట్లు పట్టుబడ్డాయి. కారులో ముగ్గురు నిందితులు వుండగా చిత్తూరు నగరంకు చెందిన సాయికుమార్(22) పోలీసులకు పట్టుబడ్డాడు. మిగిలిన ఇద్దరు పోలీసులను తప్పించుకొని పారిపోయారు. పట్టుబడిన 1,632 కర్నాకట టెట్రా మద్యం ప్యాకెట్ల విలువ 3 లక్షల రూపాయలు కాగా వాహనం విలువ మరో 3 లక్షల రూపాయలు వుంటుందని ఇన్స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# కాణిపాకంలో వైభవంగా శ్రీశోభకృత్ నామ ఉగాది వేడుకలు

కాణిపాకం, మార్చి 22 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో శ్రీశోభ కృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు దివంగత గుర్జాల మహదేవనాయుడు కుటుంబీకులు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ఉదయం పంచామృతాభిషేకం నిర్వహించి చందనాలంకారం చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకారమండపంలో వుంచి అలంకరించి ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం పండితులు మోహన రామలింగం శర్మ, వేదపండితులు పంచాంగశ్రవణం గావించి ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆలయ ఛైర్మన్ ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అధికారులు కలసి స్వామి అమ్మవార్లకు దేవస్థానం తరపున పట్టువస్త్రాలను అందజేశారు. ఆలయ అర్చకులు నూతన పట్టు వస్త్రాలను స్వామి అమ్మవార్లకు అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం పంచాంగ శ్రవణం గావించారు. ఈసందర్భంగా అర్చకులు, వేదపండితులకు నూతన వస్త్రాలను,సంభావనను అందజేశారు. ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, వేదపండితులు, ఉభయదారులు, గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



స్వామి అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు

**ఆకట్టుకున్న ప్రత్యేక అలంకరణలు:**

తెలుగు నూతన సంవత్సరం ఉగాదిపండుగ సందర్భంగా కాణిపాకం ఆలయంలో ఉభయదారులచే చేపట్టిన ప్రత్యేక అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ప్రధాన ఆలయం లోని సుపథమండపం, ఆన్వేటి మండపం, బంగారు ధ్వజస్థంభం, మూషికమండపంలను వివిధ రకాల స్వదేశీ, విదేశీజాతి పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. అదేవిధంగా ఉగాది పండుగ సందర్భంగా ఉభయదారులు భక్తులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన స్వాగత ఆర్చిలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉగాది సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణలు చేపట్టినప్పటి ప్రధాన ఆలయం చుట్టూ వున్న విగ్రహాలకు కనీసం పూలు కూడా వేయక పోవడం పట్ల భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**కిక్కిరిసిన కాణిపాకం ఆలయం:**

శ్రీ శోభకృత్‌నామ ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో కాణిపాకం ఆలయం కిక్కిరిసింది. ఆంగ్ల నూతన సంవత్సవరాది సందర్భంగా దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక అలంకరణ, ఏర్పాట్లును నిలిపివేసిన ఆలయ అధికారులు ఉగాది వేడుకలకు మాత్రం అలంకరణ ఏర్పాట్లు చేపట్టారు. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయం ఉదయం నుండి కిటకిటలాడింది.

## నాటు సారా ఊట తాగి పాడి ఆవు మృతి

వెదురుకుప్పం, మార్చి 22 ప్రభాతవార్త : నాటు సారా ఊట తాగి పాడి ఆవు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నా యి ... మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయితీ పరిధిలోని తెల్లగుండ్లపల్లె సమీపంలో కొత్తఇండ్లు వద్ద మేతకు తీసుకువెళ్ళిన ఆవుకు నాటు సారా తయారీకి అవసరమైన ఊట కన్పించడంతో ఎక్కువ మొత్తంలో ఊటను ఆవు సేవించడంతో మృతి చెందిన్నట్టు తెలిసింది. తెల్లగుండ్లపల్లె దళివాడకు చెందిన క్రిష్ణయ్య రైతు పాడి ఆవు ఘటనలో మృతి చెందిన్నట్లు చెప్పారు. నాటు సారా తయారీకి కొత్తఇండ్లకు చెందిన ఓ వ్యక్తి ఊట తయారు చేసి దాచివుంచాడు. ఆది మేతకు వెళ్ళిన ఆవు కంటపడటంతో పరిస్థితి నెలకుంది. ఈ ఘటనను వెలుగులోనికి రాకుండా ఆదే గ్రామంకు చెందిన డిప్యూటి సీఎం నారాయణస్వామి అనుచరుడు ఊట తయారు చేసిన వ్యక్తికి మద్దతుగా నిలబడి పాడి ఆవు రైతును బెదిరింపులకు గురిచేసిన్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కాగా పాడి విలువ సుమారు ఆరవై వేల రూపాయాలు ఉంటుందని తెలిపారు. నాటు సారా తయారీ నేరమని తయారు చేయకుండా ఓ వైపు అధికారులు అవగాహన కల్పిస్తున్నా ... మరో వైపు ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకుంటున్న తయారీ అరికట్టడం సాధ్యమం కావడం లేదని యాధేచ్చగా నాటుసారా తయారీ జరుగుతుందని ప్రజల వాపోతున్నారు. కాగా డిప్యూటీ సీఎం అనుచరులంటూ తిరుగుతున్న కొందరు అలాంటి వ్యక్తును వెనుకవేసుకుని కాపాడుతుంటడం పై విమర్శలు వెల్లువెతున్నాయి. ఘటన పై విచారణ చేపట్టి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని స్దానికులు కోరుతున్నారు.

## రత్నాంగి అలంకారంలో శ్రీ వెంకటేశ్వరుడు



సూళ్లూరుపేట, మార్చి 22 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీమద్వేంకట రామ్మూర్తి దేవస్థానంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం శ్రీరత్నాంగి అలంకారంలో శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం మేనేజింగ్ ట్రస్టీ బీరక రాంబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే కస్వారెడ్డిపాలెంలోని షిరిడీ సాయి బాబా ఆలయంలోనూ, సాయినగర్‌లోని ఆలయంలోనూ సాయి నాథునికి ప్రత్యేక అలంకారాలతో పాటు హోమాలు నిర్వహించారు. శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానం, బాలాంజనేయస్వామి దేవస్థానం, ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానాలలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రజలు ఉత్సాహంగా ఉగాది వేడుకలు జరుపుకున్నారు.

## కలెక్టర్ హరినారాయణన్‌ను ఆశీర్వదించిన వేదపండితులు



చిత్తూరు, మార్చి 22 ప్రభాతవార్త: శ్రీ శోభకృత్ నామ తెలుగు నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ హరినారాయణన్‌ను వేదపండితులు ఆశీర్వదించారు. దేవాదాయ శాఖ కమీషనర్ ఉత్తర్వుల మేరకు ఉగాది పర్వదినం సందర్భంగా కలెక్టర్ అర్చకులైన ఐఎస్ శ్రీనివాస్ గురుకుల్, బి.వేణు గోపాల్, శ్రీనివాసశర్మలు ఒకొక్కరికి 10,116 రూపాయలను అందించి సన్మానించి కండువా వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఏకాంబరం, అర్చక సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనంను ఢీకొన్న కారు..

## తల్లి..కుమారుడి పరిస్థితి విషమం

శాంతిపురం, మార్చి 22 ప్రభాతవార్త :కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో మఠం వద్ద బుధవారం సాయంత్రం టు వీలర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. దీంతో చికిత్స నిమిత్తం వారిని బెంగళూరుకు తరలించారు. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. కెనమాకులపల్లికి చెందిన లక్ష్మమ్మ (45), ఆమె కుమారుడు సురేష్ (27)లు ఉగాది పండగ కావడంతో బైరెడ్డిపల్లి మండలం తీర్థం గ్రామానికి వెళ్లి లక్ష్మమ్మ భర్త సమాధి వద్ద పూజలు చేసి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా మఠం వద్ద కారు ఢీకొంది. తీవ్ర రక్తగాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్ ఆపై బెంగళూరుకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## రాస్‌లో ఏనుగులు బీభత్సం - రెండు లక్షల ఆస్తి నష్టం



రేణిగుంట, మార్చి 22 ప్రభాతవార్త: రేణిగుంట మండలం చైతన్య పురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఏనుగులు ప్రవేశించి నానా బీభత్సం సృష్టించాయి. దాదాపు రెండు లక్షలు రూపాయల విలువైన ఆస్తి నష్టం కలిగించాయని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ శ్రీనివాస్ తెలిపారు. అక్కడ పడిన అడుగుల ఆధారంగా రెండు పెద్ద ఏనుగులు, మరోరెండు చిన్న ఏనుగులు వ్యవసాయ క్షేత్రంలోకి ప్రవేశించినట్లు గుర్తించామన్నారు. 15 సంవత్సరాలు వయసు గల 250 చెట్లను సర్వనాశనం చేశాయన్నారు. ఎకరా వేరుశనగ విత్తన ఉత్పత్తి క్షేత్రాన్ని, మరో ఎకరం సంపంగి మొక్కలను, ఇంకొక ఒకటిన్నర ఎకరా మిరప చెట్లను, ఆపై అర ఎకరం బంతి మొక్కలతో పాటు కొబ్బరి చెట్లను ఏనుగుల గుంపు నాశనం చేశాయన్నారు. వీటితో పాటు వ్యవసాయానికి ఉపయోగించే డ్రిప్పు పైపులు, గేటు వాల్లు, విద్యుత్ మోటార్లు, స్టాటర్లను ఎందుకు పనికి రాకుండా తమ ప్రతాపం చూపాయన్నారు. ఏనుగుల వలన కలిగిన నష్టాన్ని ఫారెస్టు, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖ, విద్యుత్ అధికారులకు తెలియజేశామన్నారు. అధికారులు కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని కోరారు.

## వరదరాజస్వామికి పట్టు వస్త్రాలు



శ్రీకాళహస్తి,మార్చి 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయానికి బుధవారం సుబ్రమణ్యం స్వామి ట్రస్టు సారథ్యాంలో యుగాది పురస్కరించుకొని పట్టు వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. స్వామితో పాటు అర్చకులు, సిబ్బందికి కూడా నూతన వస్త్రాలను అందజేసారు. ట్రస్టు సమర్పించిన నూతన సారెతో స్వామివారికి అలంకరించారు. స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ ఆలయానికి సుబ్రమణ్యం స్వామి ట్రస్టు నూతన వరవడిని తీసుకురావటం భక్తిశ్రద్ధలతో వస్త్రాలను అందించటంఅభినందనీయమన్నారు. ట్రస్టు సభ్యులు కొదండరామయ్య,సుబ్రమణ్యం, జగన్నాధం, శంకర్‌నాయుడులు పాల్గొన్నారు.

## శివభక్తులకు ఉగాది పచ్చడి



శ్రీకాళహస్తి,మార్చి 22 ప్రభాతవార్త : తెలుగు సంవత్సరాది సందర్భంగా బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులతో కిట కిట లాడింది. ఉదయం నుంచి వచ్చిన భక్తులకు సుదర్శనం కోసం రెండు రోజులుగా ఇఒ పెకె సాగర్‌బాబు, ఎసి మల్లికార్జున్‌ప్రసాద్ వారి సిబ్బంది పర్యవేక్షించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వచ్చిన ప్రతిభక్తునికి సుదర్శనం సత్వర దర్శనం కల్పించాలని సూచించారు. అధికారులతో సమీక్షించారు. ఈ మేరకు విధి విధానాలను రూపొందిం చుకున్నారు. ఈ మేరకు ఆలయాధికారులు సుదర్శనం, హరియాదవ్, ఇఇ మురళీధర్ లు పర్యవేక్షించి ఏర్పాట్లు చేశారు. ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులకు శోభాకృత నామసంవత్సరానికి సంబంధించి శుభాకాంక్షలు తెలుపుతూ పులుపు, తీపి,కారం,చేదులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని భక్తులకు ఆలయ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఇఒ వికె సాగర్‌బాబు అందించారు.

## అప్పలాయగుంటలో వైభవంగా ఉగాది ఆస్థానం



వడమాలపేట, మార్చి 22 ప్రభాతవార్త: అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శోభకృత్ నామ ఉగాది సందర్భంగా ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరుని విశేషంగా అలంకరింపచేసి మేళతాళాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాడవీధుల్లో తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. స్వామివారికి భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యులు ఉగాది విశిష్టతను భక్తులకు వివరించి పంచాంగ శ్రవణం చేస్తూ ఉగాది ఆ స్థానం నిర్వహించారు. ఉగాది పచ్చడి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్, రమణా చార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా సత్యసాయిమందిర విమానకలశ ప్రతిష్ట



శ్రీకాళహస్తి, మార్చి 22 ప్రభాతవార్త : పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన సత్యసాయిబాబా మందిరం నూతన గోపురం మరియు విమాన కలశప్రతిష్ట మహాకుంభాభిషేక కార్యక్రమాలను బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్య క్రమాలకు ముఖ్యఅతిథులుగా ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి దంపతులు, తనయ బియ్యపు పవిత్రా రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా ఆనంద్ తదితరులు విచ్చేశారు. ఈసందర్భంగా ముఖ్యఅతిధులకు ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. పవిత్రజలాన్ని ఉంచిన కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్ళి ఆలయంపై నూతనంగా ఏర్పాటుచేసిన నూతన కలశానికి అభిషేకించారు. అనంతరం ఎంఎల్ఏ మాట్లాడుతూ సత్యసాయిమందిర అభివృద్ధికోసం కుటుంబసభ్యుల తరపున రూ.10,116లు కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సత్యసాయిబాబా కమిటీ సభ్యులు, భక్తులు, పగడాలరాజు, మొగరాలగణేష్, సెన్నీరుకుప్పంశేఖర్, రమేష్, మహబూబ్‌బాషా, కలివెల, కిరణ్, సత్య, హరినాయుడు, లత, పుష్ప, బ్రహ్మయ్య, ఆర్ముగం, నాగూర్, విజయరెడ్డి, రఫి, పూర్ణ, కార్తికేయన్‌లు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమానికి విరాళం



తొట్టంబేడు,మార్చి 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఉగాదిని పురస్కరించుకొని స్వామి అమ్మవార్ల నిత్యాన్నదానమునకు గాను తొట్టంబేడు మండలం, కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన బి.లక్ష్మీసునీత ధనశేఖర్లను విరాళం అందిజేశారు. ఈ విరాళాన్ని ఇ.ఓ సాగర్‌బాబు, ఆలయ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆలయానికి అందజేశారు.

## అశ్వవాహనంపై శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారు



చంద్రగిరి, మార్చి 22 ప్రభాతవార్త: చంద్రగిరి గ్రామ దేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారు అశ్వ వాహనంపై విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. శోభకృత్ నామ సంవత్సరం ఉగాదిని పురస్కరిం చుకుని బుధవారం ఆలయ ఉభయదారులు గ్రామోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు వేకువ జామున అమ్మవారికి అభిషేకం నిర్వహించి విశేష అలంకరణ గావించి భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. ఉదయం 8 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి అశ్వ వాహనంపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల భజనలు, బ్యాండుబాజాల నడుమ అమ్మవారు పట్టణ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ పాకాల సతీష్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి, శ్రీదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**-పంచాంగ శ్రవణం**

సాయంత్రం 6 గంటలకు అమ్మవారి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారి ఉత్సవమూర్తిని వినాధారిగా శోభాయమానంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శివరామశర్మ ఉగాది విశిష్టతను వివరించారు. అమ్మవారి ఊంజల్ సేవ కన్నుల పండువగా నిర్వహించారు. ఊంజల్ సేవకు బ్లూమింగ్ బడ్స్ స్కూల్ ఛైర్మన్ హితేంద్రనాథ్ రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

## ఏడుగంగమ్మల ఆలయంలో ప్రత్యేకాలంకారం



శ్రీకాళహస్తి,మార్చి 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఏడుగంగమ్మల ఆలయంలో బుధవారం యుగాది సందర్భంగా ప్రత్యేక పూజలు అలంకారాలు చేపట్టారు.ఇక్కడ రిటైర్డ్ ఉపాధ్యాయుడు పోలసామి స్వర్ణమూర్తి సారథ్యంలో ప్రత్యేకాలంకారం నిర్వహించారు. చుట్టుపక్కల వీధుల్లోని ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

## శ్రీసిటీలో ఉగాది వేడుక

**-పలువురు ప్రముఖులకు పురస్కారాలు**





సత్యవేడు, మార్చి 22,ప్రభాతవార్త: తెలుగు నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని శ్రీసిటీలో ఉగాది వేడుకలు నిర్వహించారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్యవేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చేతుల మీదుగా శ్రీవాణి ప్రతిష్టాత్మక ఉగాది భాషా పురస్కారాన్ని డాక్టర్ కాసల నాగభూషణం, కవితా పురస్కారాన్ని వక్కలంక సీతారామారావ్, ఉగాది కథా పురస్కారాన్ని కుప్పిలి పద్మ, ఉగాది ఆధ్యాత్మిక పురస్కారాన్ని ఒంటి రవి, ఉగాది గాయక పురస్కారాన్ని రాము మహారాజపురం అందుకున్నారు. పురస్కారగ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపిన రవీంద్ర సన్నారెడ్డి, ఉగాది పర్వదినాన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పారిశ్రామికంగా ఎదుగుతున్న శ్రీసిటీ, మంచి నివాసయోగ్య ప్రాంతంగా రూపుదిద్దుకునే క్రమంలో కళలను ప్రోత్సహిస్తూ శ్రీవాణి ఆధ్యాత్మిక వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉగాది పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ శ్రీసిటీ ప్రగతిని, పచ్చదనాన్ని కవితలు, పాటలు, పద్యాల రూపంలో వర్ణించారు. ఈసందర్భంగా సూళ్ళూరుపేటకు చెందిన ఎంజీఆర్ మ్యూజిక్ అకాడమీ బృందం చేసిన వీణావాదన సభికులను ఎంతగానో అలరించడంతో పాటు ప్రశంసలు అందుకుంది. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా రాజగోపాలరెడ్డి, శోభారాజా, డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, సంవే రమేష్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గిపేరి వాసులకు 'సిపాయి భరోసా'



శ్రీకాళహస్తి,మార్చి 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సామాజిక సేవలను అందించుటకు రష్ అధినేత ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం ప్రకృతి వైపరీత్యాలకు గురైన కుటుంబాలను ఆదుకొనుటకు 'సిపాయి భరోసా' కార్యక్రమాలను రూపొందించారు.ఏర్పేడు మండలం దుర్గిపేరి గ్రామంలో మాజీ సర్పంచ్, మాజి ఎంపిటిసి గాది చెంగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కర్మక్రియల సందర్భంగా బుధవారం వారి కుటుంబాలను కలసి మనోధైర్యం కల్పించారు.వారి కుటుంబసభ్యులకు 40రకాల ఆహార ధ్యాన్యాలను అందించారు. కుటుంబపోషణకు యజమాని అయిన చెంగారెడ్డి మృతి చెందటంతో వారినిఆదుకొనుటకు ఈ పథకాన్ని అందించినట్లు సిపాయి సుబ్రమణ్యం వివరించారు.ఈ సందర్భంగా సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ సమాజంలో ఎందరో నిర్భాగ్యులుగా మారుతున్నారని వివరించారు.తాను ఆది నుంచి నిరుపేదలకు సేవలందిస్తున్నామన్నారు. ముఖ్యంగా వైద్యపరంగా తన వద్దకు ఎవరు వచ్చినా సహాయం అందిస్తున్నామన్నారు.తాను గతంలో ఎన్నికల్లోపోటీ చేస్తే 30వేల మంది ఓట్లు వేసారన్నారు.అంతేకాక తననునిత్యం శ్రీకాళహస్తి ప్రజలు ఆదరిస్తున్నారని ఓ కుటుంబసభ్యునిగా ఆదరిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ మునిరెడ్డి, ఇసుకతాగేలి ఎంపిటిసి మునిరెడ్డి, అల్లికేశం సర్పంచ్ శివరెడ్డి, మునికృష్ణ, ఎల్లప్పరెడ్డి, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి,చంద్రమౌళి, దశరధరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉగాదిని పరస్కరించుకొని కాణిపాకం ఆలయంలో బుధవారం ఆలయాన్ని వివిధ రకములైన పుష్పాలతో అలంకరించిన దృశ్యం **- ప్రభాతవార్త, కాణిపాకం**

# వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి... పంటలు బాగా పండుతాయి!



పంచాంగం పఠనం చేస్తున్న సత్యనారాయణ శర్మ

శ్రీకాళహస్తి,మార్చి 22 ప్రభాతవార్త : 'ప్లవ నామ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉంటారని, పంచాంగం చెబుతుందని ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని దర్శనం, పూజలతో సకల దోష పరిహారం సాధ్యమౌతుందని ఆస్థాన వేదపండితులు, సిద్ధాంతి బెంగుళూరుకు చెందిన సత్యనారాయణశర్మ అన్నారు. బుధవారం రాత్రి ఇక్కడి స్వామి సన్నిధి ఎదురుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం మొదటి సారి రూపొందించిన పంచాంగం పఠనాన్ని సత్యనారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రహసంచారాన్ని గురించి వివరిస్తూ సమాజంలో వాతావరణం అనుకూలంగా ఉంటుందన్నారు. పంచాయ పఠనానికి విచ్చేసిన ఆయన స్వామి వారి గర్భ గుడి ఎదురుగా ఉన్న బంగారుధ్వజస్థంభం ఎదుట భవిష్యత్తును గురించి వివరించారు. ఈ ఏడాది వర్షాలు గణనీయంగా ఉంటాయని వివరించారు. జనంలో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని వివరించారు.ఈ పంచాగం శ్రవణంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఒ వి కె సాగర్‌బాబు, ఎసి మల్లికార్జున ప్రసాద్ ఎఇఒ సతీష్ మాలిక్,విశేషసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

**ప్రపంచదేశాల్లో భారత్‌కు గుర్తింపు వస్తుంది:**

భారత దేశానికి ప్రపంచదేశాల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని వివరించారు. వివిధ అంశాలకు సంబంధించి సమస్యలకు సంబంధించి భారత దేశం కీలకంగా వ్యవహారించి మంచి పేరు ప్రతిష్టలు సాధిస్తారు. ఐక్యరాజ్యసమితిలోనూ, ప్రపంచ ఆరోగ్యసంస్థలో భారత దేశానికి కీలక పాత్ర లభిస్తుందని పంచాంగం చెబుతుందన్నారు. అయితే సమాజంలో పాడిపంటలు బాగా ఉన్నా దొంగల భయం అధికమౌతుందని గ్రహ స్థితి గోచరిస్తుందని వివరించారు.

**శ్రీకాళహస్తీశ్వరుని ప్రాశస్త్యం బాగా పెరుగుతుంది:**

ప్రపంచ దేశాల్లో రాహుకేతుదోష నివారణ దివ్యక్షేత్రంగా విరాలజిల్లుతున్న శ్రీకాళహస్తి ప్రాశస్త్యం బాగా పెరుగుతుందన్నారు.దేవస్థానంలో నిర్వహిస్తున్న సేవలతో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఇక్కడి దివ్యక్షేత్రం సందర్శనంతో సత్ఫలితాలు సాధిస్తారని పంచాంగం చెబుతుందన్నారు. వ్యాపారులకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. ఇక వృత్తిలో ఉన్న వారికి మంచి జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన అభిషేక గురుకుల్, డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉగాదిని సందర్భంగా సింహవాహనంపై స్వామివారు దర్శనం - ప్రభాతవార్త, తిరుపతి